






www.aakshitha.com

People's voice


# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

శనివారం | 06 | జూన్ | 2026 | పేజీలు: 08



# పురలో సహా చట్టం..
# సమాధి

**అవినీతి అక్రమాలకు చిరునామే మధుసూదన్ రెడ్డి**

సమాచారం ఇవ్వడంలో కానరాని పారదర్శకత

మచ్చుకైనా కానరాని జవాబుదారితనం

సమాచార హక్కు చట్టం మనుగడ ప్రశ్నార్ధకం






పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి : ఇస్నాపూర్ గతంలో గ్రామపంచాయతీలో..... ఇప్పుడు పూరపాలక సంఘంలో సమాచార హక్కు చట్టం మనుగడ ప్రశ్నార్ధకంగా మారింది. ప్రభుత్వం నుంచి జవాబుదారితనం, పారదర్శకత కోరుకునే ప్రజలకు గొప్ప వరం సమాచార హక్కు చట్టం. అమలులో లోపాల వల్ల ఇది క్రమంగా నీరుగారిపోతోంది. ప్రజలకు సమాచార హక్కు చట్టం పై పూర్తిగా నమ్మకం సన్నగిల్లే ప్రమాదం పొంచి ఉంది. పాలనలో పారదర్శకతకు బాటలేయలి. అధికారుల్లో జవాబుదారితనం పెంపొందించాలి. అవినీతిని కాడగపెట్టి తరిమేయాలి. ప్రజాధనం ..మిగతా 2లో

# చేనేతకు చేయూత

**నేతన్నల కుటుంబాలకు ఆసరా**

**చేనేత ప్రదర్శనను ఘనంగా ప్రారంభించిన మంత్రులు**

**కోమటిరెడ్డి వెంకటరెడ్డి , తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



యాదాద్రి భువనగిరి/ అక్షిత బ్యూరో: యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి నేతృత్వంలో హైదరాబాద్ హైటెక్స్ హాల్ నెంబర్ 4 లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్థాయి ' థ్రెడ్ పోచంపల్లి చేనేత ప్రదర్శన, విక్రయ కేంద్రాన్ని రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ ..మిగతా 2లో

# అడవులను పరిరక్షించుకుందాం

**ములుగులో 77 శాతం అటవీ విస్తీర్ణం**

**మేడారం అభివృద్ధికి పచ్చదనానికి ప్రాధాన్యం**

**పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి**

ములుగు, అక్షిత న్యూస్: అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ..మిగతా 2లో








# మొక్కల సంరక్షణ అవశ్యం

**ఆక్సిజన్ పార్క్‌లో మొక్కల నాటడం ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**పర్యావరణ పరిరక్షణకు మొక్కల నాటడం జీవితంలో భాగం కావాలని పిలుపు**

**ప్రతి గ్రామంలో మొక్కల సంరక్షణకు ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు**

**ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలని సూచన**

సిద్దిపేట, అక్షిత బ్యూరో : కొండపాక మండలం, మర్పడగ గ్రామం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మర్పడగ గ్రామంలోని అర్బన్ ఆక్సిజన్ పార్క్‌లో మొక్కల నాటకం కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ హైమావతి, సీపీ రష్మీ పెరుమాళ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, డీఎఫ్ఓ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ధరిపల్లి చంద్రం తదితర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ..మిగతా 2లో



## మొక్కల సంరక్షణ అవశ్యం

మొదటి పేజీ తరువాయి...

భాగంగా "పర్యావరణాన్ని పరిరక్షించడానికి చెట్టు విలువ తెలుసా?" అనే అవగాహన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రపంచమే కుగ్రామంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ఒక కార్యక్రమంగా కాకుండా జీవన విధానంలో భాగం కావాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 280 మహిళా సంఘాలకు గవర్నర్ చేతుల మీదుగా స్టీల్ బ్యాంక్ కింద 13 రకాల వస్తువులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే 500 హోటళ్లకు గ్లాసులు అందజేశామని పేర్కొన్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ ఈరోజు సూర్యాపేటతో కలిసి అవార్డు అందుకోనుందని వెల్లడించారు. ఢిల్లీలో కాలుష్యం తీవ్రంగా పెరిగి నివసించడానికి ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని, తెలంగాణలో అలాంటి పరిస్థితులు రాకుండా ముఖ్యమంత్రి ఈవీ పాలసీ అమలు చేస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సున్నా వస్తు విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలో మొక్కల నాటకం, సంరక్షణ కోసం ఐదుగురు సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలు ఉన్నచోట్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని కోరారు. ఒకప్పుడు గ్రామాల్లో విస్తారంగా కనిపించిన పండ్ల చెట్లు తగ్గిపోవడంతో కోతులు గ్రామాల్లోకి వచ్చి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయడం మాత్రమే కాకుండా ఆచరణలో కూడా చూపించాలని సూచించారు. గ్రామాల మధ్య మొక్కల నాటకంలో పోటీ వాతావరణం సృష్టించి, ఉత్తమంగా మొక్కలు నాటి సంరక్షించిన గ్రామాల సర్పంచ్‌లను అభినందించాలని మంత్రి పిలుపునిచ్చారు.

## అడవులను పరిరక్షించుకుందాం

మొదటి పేజీ తరువాయి...

పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ములుగు జిల్లా ఇంచర్ల ఏకో పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అటవీ సంరక్షణాధికారి కాళేశ్వరం జోన్ బి. ప్రభాకర్ ఐఎఫ్ఎస్, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఇంచర్ల సర్పంచ్ కుమార్ గౌడ్ తదితరులతో కలిసి మంత్రి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ నిబద్ధతను చాటారు. అనంతరం అటవీ శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను సందర్శించి అటవీ సంపద, జీవ వైవిధ్యం, వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించిన చిత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ సంరక్షణ ప్రతిజ్ఞ నిర్వహించగా, అనంతరం శ్రీగంధం మొక్కలను పంపిణీ చేశారు. అలాగే సమ్మక్క--సారలమ్మ స్మృతి వనం పోస్టర్, తాడ్వాయి హట్స్ పర్యాటక ప్రచార పోస్టర్‌లను ఆవిష్కరించారు. అటవీ సంరక్షణ, పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఫారెస్ట్ రేంజ్ అధికారులకు డ్రోన్ కెమెరాలను అందజేశారు. దేవగిరిపట్నం గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్ రెడ్డి అడవి పందుల దాడిలో మృతి చెందగా, ఆయన కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయ చెక్కును మంత్రి అందజేశారు.


**ప్రజల భాగస్వామ్యంతోనే అటవీ సంరక్షణ సాధ్యం: మంత్రి సీతక్క**

మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, అడవుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. గ్రామస్థాయిలో అటవీ సంరక్షణపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వన సంరక్షణ కమిటీల తరహాలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, స్థానిక యువతతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి అడవుల రక్షణ బాధ్యతలు అప్పగిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

తెలంగాణలో అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లాగా ములుగు నిలిచిందని, ములుగు నియోజకవర్గంలో 77 శాతం, జిల్లాలో 64 శాతం అటవీ విస్తీర్ణం ఉండటం గర్వకారణమని తెలిపారు. ఈ అటవీ సంపదను భావితరాలకు అందించేందుకు మరింత శ్రద్ధతో సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

# పురలో సహా చట్టం..

# సమాధి




మొదటి పేజీ తరువాయి...

దుర్వినియోగం కాకుండా పరిరక్షించాలి. అనే సంకల్పంతో అమలులోకి వచ్చిన ఏకైక చట్టం సమాచార హక్కు చట్టం. కానీ దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో సమాచార హక్కు చట్టం అమలు కోసం ఏర్పడిన సమాచార కమిషన్ సమాచారం ఇవ్వని అధికారులకు జరిమానాలు విధిస్తున్న తీరు మారడం లేదు. సాధారణ సమాచారం అయితే ఇస్తున్నారు కానీ అవినీతి గల సమాచారం, లోపాలు గల సమాచారం ఇవ్వడం లేదు. సమాచార హక్కు చట్టం దరఖాస్తుదారుడు తమకు శత్రువు అయినట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పాలన పారదర్శకత కొరవడి ప్రజలకు న్యాయం జరగడం లేదనేది నగ్నసత్యం.


**ఇస్నాపూర్ పిఐఓ వంకలతో కాలయాపన..**

గతంలో ఇస్నాపూర్ పంచాయితీ, ఇప్పుడు పురపాలకలో ఏదైనా సమాచారం కోసం దరఖాస్తు చేస్తే స్పందన ఉండడం లేదు. నెలలు కాదు సంవత్సరాలు గడిచిన సమాచారం అందడం లేదు. ప్రశ్నలు అడిగే తీరులో లోపాలను పట్టుకుని సమాచారాన్ని తిరస్కరిస్తున్నారు.సూటిగా, స్పష్టంగా సమాచారాన్ని అందించడం లేదు.తెలుగులో దరఖాస్తు చేస్తే ఇంగ్లీషులో సమాచారం అందిస్తున్నారు. తెలుగు మాత్రమే తెలిసిన దరఖాస్తుదారులకు ఇంగ్లీష్ సమాచారం ఎలా ఉపయోగపడుతుందనేది అప్పిలేట్ అథారిటీకి ఫిర్యాదు చేసిన.. పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. అప్పీళ్ళపై సహేతుకంగా విచారణ నిర్వహించి,చర్యలు తీసుకునే విధం తగ్గింది. దీంతో దరఖాస్తుదారులు చేసేదేమీ లేక మళ్లీ దరఖాస్తులు పెడుతున్న.. సమాచారం రావడం లేదంటూ ఫిర్యాదుదారులు చింతిస్తున్నారు.

**సమాచారానికి మధుసూదన్ రెడ్డి అడ్డుగోడ...**

సమాచార హక్కు చట్టం సెక్షన్ 7(1) ప్రకారం 30 రోజులలో ఇవ్వాల్సిన సమాచారం కోసం అధికారులు కుంటిసాకులు వెతుక్కుంటున్నారు. అవగాహన లేమితో సహాయ నిరాకరణ చేస్తున్నారు. తమ కార్యాలయంలో సమాచారం లేకపోతే సెక్షన్6(3) కింద ఆ దరఖాస్తును 5 రోజుల్లో సమాచారం గల కార్యాలయానికి పంపాలి. కానీ తీరిగ్గా 30 రోజుల తర్వాత దరఖాస్తును బదిలీ చేస్తున్నారు. మరికొందరు ప్రజా సమాచార అధికారులకు దరఖాస్తు చేస్తే ఇది సెక్షన్2( ఈ) ప్రకారం



సమాచారం కిందకు రాదని, దరఖాస్తును తిరిగి పంపిస్తున్నారు. సమాచారం కోసం దరఖాస్తు చేస్తే కొందరు అధికారులు సంవత్సరాలు గడిచిన సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో సెక్షన్4(1) బి ప్రకారం 17 అంశాల సమాచారం ప్రతి ఏడాది అప్డేట్ చేసి ఉంచాలి. కానీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఫలితంగా సమాచార హక్కు చట్టం అమలు తీరు నామమాత్రంగా మారింది.

**"30 రోజులు గడిచిన సమాచారం ఇవ్వక పోవడానికి గల కారణం ఏమిటో.. మధుసూదన్ రెడ్డి?**

సామాన్య పౌరులు ఏదైనా కార్యాలయంలో సమాచారం అడిగితే సమాచార హక్కు చట్టం ప్రకారం 30 రోజుల్లో ఇవ్వాల్సి ఉండగా సుమారు 50-60 రోజులు గడుస్తున్న గతంలో ఇస్నాపూర్ గ్రామపంచాయతీలో, ఇప్పుడు పురపాలక సంఘంలో సమాచారం ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు చట్టాన్ని అమలు చేసేందుకు విముఖత చూపిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.చట్టం అమలు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమాచార హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చట్టం అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే సమాచార హక్కు చట్టం అమలు కోసం ఉద్యమం చేయక తప్పదు. దీనిపై నిరంతర పోరాటం సాగిస్తామని పలువురు మేధావులు, విద్యావేత్తలు, సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నాయకులు అంటున్నారు.

**మధుసూదన్ రెడ్డి అక్రమాలు వెలుగులోకి రాకూడదనే చట్టం నిర్వీర్యం..**

ఇస్నాపూర్ పురపాలక సంఘం మేనేజర్/రెవెన్యూ అధికారి మధుసూదన్ రెడ్డి పనితీరులో పారదర్శకత లోపించి, అక్రమాలకు పాల్పడుతుండటంతో సమాచార హక్కు చట్టం నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే సమాచార హక్కు చట్టం అమలులో ప్రభుత్వాలు సైతం దృష్టి సారించకపోవడంతో అధికారులు చట్టాన్ని అమలు చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కాగా గత ప్రభుత్వ హయాంలో అధికారంలో ఉన్న పెద్దలు ప్రభుత్వాన్ని రాజ్యాంగ బద్ధంగా కాకుండా రాజరిక పాలన లాగా సాగించారు. చట్టాలు అమలు కాక అడిగేవారు లేక అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారిన అధికారులు తమ పద్ధతులు మార్చుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వంలో వ్యవహరించిన మాదిరిగానే నాయకుల అండదండలతో ప్రస్తుతం అదే మాదిరిగా ఇప్పుడు కూడా ముందుకు సాగుతున్నారు. ప్రస్తుత రాజకీయ పెద్దల అండదండలతో ప్రభుత్వ అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం దరఖాస్తుదారులకు ఇస్తే, తమ అవినీతి అక్రమాల చిట్టా బయటకు తెలుస్తాయి. కాబట్టే మేనేజర్ మధుసూదన్ రెడ్డి సమాచారం దరఖాస్తు దారులకు ఇచ్చేందుకు వివిధ సాకులు చూపిస్తూ, సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారనే భావన సర్వత్రా వినిపిస్తోంది. మరి ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తారా లేక అవినీతి అక్రమాలు బయటపడకుండా సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తారో వేచి చూడాల్సిందే."

# చేనేతకు చేయూత

మొదటి పేజీ తరువాయి...

శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి , భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ వైభవ ప్రారంభోత్సవ వేడుకలో భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య విశిష్ట అతిథులుగా పాల్గొని ప్రదర్శనలోని చేనేత స్టాళ్లను సందర్శించారు.ఎమ్మెల్యే కుంభం మాట్లాడుతూ భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని చేనేత కుటుంబాల అభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తామని, హైదరాబాద్ నగర ప్రజలు, చేనేత ప్రియులు జూన్ 5 నుండి జూన్ 7 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి, వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని




పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ చైర్మన్ వెంకరమణ, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం ప్రజాప్రతినిధులు, చేనేత జౌళి శాఖ , ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు మరియు చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, నేతన్నలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



# పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

**మొక్కల పెంపకం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందిద్దాం**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్ లో మొక్కలు నాటే కార్యక్రమం**

**అర్బన్ ఫారెస్ట్ పార్క్ పై రీల్స్ పోటీలు పెట్టి విస్తృత ప్రచారం కల్పించాలని సూచన**





**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా భావించాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ సమీపంలోని పోతిరెడ్డిపల్లె ఫారెస్ట్ రిజర్వ్ బ్లాక్ లోని



అర్బన్ ఫారెస్ట్ పార్క్ లో "ఏక్ పెడ్ మా కే నామ్" పేరుతో ఎక్కువ సాంద్రత కలిగిన మొక్కలను నాటే కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా కలెక్టర్ మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని మహిళలు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పర్యావరణ పరిరక్షణ అంశాన్ని ఉద్దేశించి మాట్లాడారు.ప్రతీ ఇంటి ఆవరణలో మొక్కలు నాటడానికి గ్రామంలోని నర్సరీ ద్వారా మొక్కలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అందరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. అడవుల శాతం ఎక్కువగా ఉంటేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనే విషయాన్ని అందరూ గమనించి మొక్కలను పెంచాలని అన్నారు.ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించడానికి కృషి చేయాలని, ఎల్లారెడ్డిపేట మండలంలోని అన్ని గ్రామాల్లో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసేలా క్షేత్ర స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు. హరిదాస్ నగర్ గ్రామంలో స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేసినందుకు గ్రామ సర్పంచ్ ను కలెక్టర్ అభినందించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని, మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.కాలుష్య నియంత్రణ మండలి వారి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా పేపర్ ప్లేటు, గ్లాసుల వినియోగంపై ఏర్పాటు చేసిన స్టాల్ ను సందర్శించారు.అనంతరం అర్బన్ ఫారెస్ట్ పార్క్ లో పిల్లలు ఆడుకునే స్థలం, యోగా షెడ్, వాకింగ్ ట్రాక్, గజెబో, బెంచీలు, హెర్బల్ గార్డెన్, బుద్ధ విగ్రహం, నీటి మధ్యలో ఉండే బ్రిడ్జ్ ను కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

**రీల్స్ పోటీలు నిర్వహించి.. విస్తృత ప్రచారం చేయాలి**

అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో పచ్చదనం, సందర్శకుల సౌకర్యార్థం కల్పించిన మౌలిక సదుపాయాలు, అటవీ సంపదపై విస్తృత ప్రచారం కల్పించి, సందర్శకులు వచ్చేలా సామాజిక మాధ్యమాల వేదికగా రీల్స్ పోటీలు నిర్వహించి విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.అందరినీ ఆకర్షించేలా పార్క్‌పై రీల్స్ పోటీలను నిర్వహించాలని, పార్క్‌లోని విశేషాలు అందరికీ తెలిసేలా సృజనాత్మకంగా రీల్స్ రూపొందించి, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందు తుందన్నారు. రీల్స్ పోటీలలో అత్యుత్తమంగా రీల్స్ రూపొందించిన వారికి నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, డీఎస్పీ నాగేంద్రచారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీపీఓ అఫ్జల్ బేగం, హార్టికల్చర్ అధికారి శరత్, డీవైఎస్ఓ రాందాస్, ఏడీ మైన్స్ క్రాంతి, ఎఫ్ఆర్ఓ నాగేశ్వర్ రావు, హరిదాస్ నగర్, పదిర సర్పంచులు నాగరాజు, మణెమ్మ, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం

**రైతులు ఆందోళన చెందవద్దు**

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పురోగతిపై తడిసిన ధాన్యం కొనుగోలు అంశాలపై కలెక్టర్ చిత్రా మిశ్రా, సివిల్ సప్లయ్స్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో మంత్రి ఫోన్‌లో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఏర్పాటు చేసిన 317 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 261 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని, మిగిలిన కేంద్రాల్లో ఉన్న సుమారు 9,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.అలాగే జిల్లాలోని 16 మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 8 మండలాల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన మండలాల్లో కూడా వేగవంతంగా కొనుగోళ్లు పూర్తి చేయాలని సూచించారు.రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని మంత్రి పేర్కొన్నారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, తడిసిన ధాన్యం విషయంలో కూడా రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

**మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టె సంతోష్ కుమార్**

**రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** తెలంగాణ ముఖ్యమంత్రి ఏ . రేవంత్ రెడ్డి పై దేవరకొండ మండలం కొర్ర తండాకు చెందిన జనసేన కార్యకర్త కొర్ర చందు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ రామన్నపేట మండల యువజన కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టె సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో రామన్నపేట సబ్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేసి, కొర్ర చందుపై తక్షణమే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బట్టె సంతోష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఖండనీయమన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజా నాయకులపై మాట్లాడేటప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇలాంటి వ్యాఖ్యలను యువజన కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నకిరేకల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పున్న అమరేందర్, మండల ఉపాధ్యక్షులు కేస సాయి, జవ్వాజి శ్రీకాంత్, రుద్రాల విక్కీ సాయి, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

**పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి**

**మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ,వెంకటరత్నం బాబు**



**కోదాడ అక్షిత ప్రతినిధి:** పర్యావరణ పరిరక్షణ తోనే మానవ మనుగడ అని,పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై డివైడర్ల మధ్య ఉన్న మొక్కలను కాపాడుకునేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, సిబ్బందితో కలిసి చైర్ పర్సన్ స్వయంగా చెట్లకు పాదులు చేసి, ఎరువులు వేసి, నీళ్లు పోశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడమే కాకుండా, వాటిని వృక్షాలుగా మార్చే వరకు సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. పచ్చని చెట్లతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని పేర్కొంటూ పట్టణ ప్రజలందరికీ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి, కమిషనర్ రమాదేవి, డి ఈ సాయి లక్ష్మి, కౌన్సిలర్లు ఎలమందల నరసయ్య, గంధం పాండు, మాజీ కౌన్సిలర్ కాజా మొయినుద్దీన్, కాంగ్రెస్ నాయకులు రావెళ్ళ కృష్ణారావు, మైలారి శెట్టి భాస్కర్, ధన మూర్తి, క్షత్రయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY

శనివారం | 06| జూన్ | 2026

# పర్యావరణ రక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్

## కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** పర్యావరణ పరిరక్షణకు మనమందరం బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక, అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని డీర్ పార్కులో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి , చీఫ్ కన్జర్వేటివ్ ఆఫీసర్ క్షితిజ, వివిధ శాఖల అధికారులతో కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో "కలెక్టర్" మాట్లాడారు. వచ్చే నాలుగు నెలల్లో విరివిగా మొక్కలు నాటేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. నాణ్యమైన మొక్కలను నర్సరీలో పెంచుతున్నామని అన్నారు.

కాలుష్య రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని పేర్కొన్నారు "సీపీ "మాట్లాడుతూ మన పూర్వీకులు మనకు కోసం మొక్కలు నాటినట్లు.. మనం భావితరాల కోసం మొక్కలు నాటి మంచి వాతావరణం అందించాలని పేర్కొన్నారు.

"మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ" నగరపాలిక పరిధిలో ఆరు నర్సరీలు ఏర్పాటు చేశామని.. ఇంటింటికి మొక్కలు అందిస్తామని 7.50 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

"చీఫ్ కన్జర్వేటివ్ ఆఫీసర్ క్షితిజ మాట్లాడుతూ" అవర్ క్లైమేట్ అవర్ ఫ్యూచర్ నేచర్ ఈజ్ ఇన్స్పిరేషన్ అని థీమ్ తో ఈ సంవత్సరం పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని పార్కుల్లో మొక్కలు నాటాలని కేంద్రం నిర్ణయించిందన్నారు.

"రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ" ప్రకృతిని మనం కాపాడితే.. ప్రకృతి మనల్ని కాపాడుతుందని పేర్కొన్నారు. "స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ" వాకాడే మాట్లాడుతూ పర్యావరణ రక్షణకు పాఠశాలల్లో ఎల్పిజి గ్యాస్ సిలిండర్ లోనే వినియోగిస్తున్నట్లు తెలిపారు. మనం ఏదోరకంగా పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు.

"సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్" రెడ్డి మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించడం ముఖ్యమని.. కాంక్రీట్ జంగిల్ కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు.

అనంతరం పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగంతో నష్టాలు, పచ్చదనం ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## నార్లాపూర్ ప్యాకేజీ--2, ప్యాకేజీ--3 కాలువల నిర్మాణ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ ప్యాకేజీ--2, ప్యాకేజీ--3 కాలువల నిర్మాణ పనుల పురోగతిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకాటి శ్రీహరి ముఖ్యమంత్రితో కలిసి కాలువల నిర్మాణ పనులను సందర్శించి, జరుగుతున్న పనుల ప్రగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, పాలమూరు ప్రాంతానికి సాగు మరియు తాగునీటి అవసరాలను తీర్చే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు

## నూత్‌పల్లి గ్రామంలో వివో భవన నిర్మాణానికి భూమిపూజ....!



**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామంలో వివో (ఓూ) భవన నిర్మాణం కోసం ఈరోజు భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురకంటి రాజారెడ్డి, ఉప సర్పంచ్ గోపిడి నర్సారెడ్డి, పీఆర్ఏఈ రాజ్‌కుమార్, కార్యదర్శి రవిస్వామి, దిలీప్, గడ్డం బోజారెడ్డి, వివో అధ్యక్షురాలు లహరి, మహిళా సంఘ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి వివో భవనం ఉపయోగపడుతుందని, మహిళా సంఘాల కార్యకలాపాలకు మరింత సౌకర్యం కలుగుతుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

## ఈ నెల 8 నుంచి ఏఐ, లైఫ్ స్కిల్స్‌పై వర్క్ షాప్




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు ఖమ్మంలోని బీసీ స్టడీ సర్కిల్లో నాలుగు రోజుల పాటు ఏఐ,లైఫ్ సిల్క్స్ పై వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు ఖమ్మం బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి శ్రీలత తెలిపారు. విద్యార్థులకు ఏఐ ప్రాథమిక అంశాలు అప్లికేషన్లపై అవగాహన కల్పించడం జీవనోపాధి కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించేలా తీర్చిదిద్దడం ఈ వర్క్షాప్ లక్ష్యమని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 6వ తేదీ లోపు ఖమ్మంలోని బీసీ స్టడీ సర్కిల్లో దరఖాస్తు చేసుకోవాలని వివరాలకి 08742-230848, 94419 31359 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## కడ్తాల్ చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన పాలక మండలిని ఘనంగా సన్మానించిన మాజీ జెడ్పిటిసి ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్





**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కడ్తాల్ మండల కేంద్రంలో శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయ కమిటీ బోర్డ్ చైర్మన్ గూడూరు జంగారెడ్డి తో పాటు సభ్యులు రమేష్ యాదగిరి. మంజుల నరేందర్ రెడ్డి కో ఆప్షన్ సభ్యులు శ్రీమన్నారాయణ లను ఘనంగా శాల్వాలతో సన్మానించినా కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయ అభివృద్ధికి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఏమైనా సమస్యలు ఉంటే మీతో పాటు సహకరించడంలో తన ట్రస్టు ముందుంటుందని బోర్డు సభ్యులకు చెప్పడం జరిగింది అదేవిధంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా దేవాలయ ఆవరణలో భావితరాల కోసం మొక్కలు నాటడం జరిగిందని .ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బిక్షపతి తో పాటు సేవ్య నాయక్ శ్రీను నాయక్ మాజీ సర్పంచ్ హంస మొతియా నాయక్ మాజీ రైతు కోఆర్డినేటర్ జోగు వీరయ్య మాజీ మార్కెట్ డైరెక్టర్ లయక్ అలీ మాజీ ఉపసర్పంచులు కడారి రామకృష్ణ సభావత్ శ్రీను నాయక్ వార్డు సభ్యులు నాగిళ్ల మల్లయ్య జాంగిర్ బాబా శ్రీను నాయక్ దేవా నాయక్ ప్రశాంత్ నాయకులు కుమార్ గౌడ్ నాగరాజ్ కృష్ణ పవన్ శ్రీకాంత్ నరసింహ లక్ష్మణ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యేక ప్రజా దర్బార్లు

### పోచాపూర్, లింగాల గ్రామాల్లో మంత్రి సీతక్క, కలెక్టర్ హేమంత్ వినతుల స్వీకరణ



**ములుగు, అక్షిత న్యూస్:** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని పోచాపూర్, లింగాల గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.

పోచాపూర్ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా దర్బార్‌లో బిట్టుపల్లి, బంధాల, పోచాపూర్, నర్సాపూర్ పీఎల్, బోల్లెపల్లి గ్రామాల ప్రజలు తమ సమస్యలు, అవసరాలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్న మంత్రి సీతక్క, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అదే రోజు లింగాల గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా దర్బార్‌లో ఒడ్డుగూడెం, లింగాల, బోటి లింగాల, లవ్వల, కోడిశాల గ్రామాల ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రభుత్వ సేవలు ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వట్టెం పంప్ హౌస్ మూడో లిఫ్ట్‌ను సందర్శించిన సీఎం.రేవంత్ రెడ్డి

నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి: ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను రెండు రోజులపాటు పరిశీలించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామం వద్ద ఉన్న వట్టెం పంపు హౌస్ మూడో లిఫ్టును సందర్శించారు. ఎస్ జె ఆర్ పిఆర్ఎల్ఐఎస్ ( పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్) లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.



2020- 2023 సంవత్సరం నాటికి రూ 3300 కోట్లు ప్రాజెక్టుకు ఖర్చు చేయగా, 2023వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు రూ. 800 కోట్లను ఖర్చుచేసి ప్రాజెక్ట్ పనులను కొనసాగించడం జరిగిందన్నారు. పెండింగ్ లో ఉన్న మిగతా సివిల్ పనులను రూ.90 కోట్లతో వచ్చే మూడు నెలల్లో పూర్తి చేయనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఇక్కడ మొత్తం 10 పంపులు ఉండగా 5 పంపులను ఫిట్ చేసి ట్రయల్ రన్ ను విజయవంతంగా నిర్వహించామన్నారు. వర్షాకాలంలో నీళ్లు రాగానే వెంకటాద్రి రిజర్వాయర్ కు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తామన్నారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం మొత్తం 16.74 టీఎంసీలు కాగా స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం ద్వారా విడతల వారీగా రిజర్వాయర్ ను నింపడం జరుగుతుందన్నారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా మొత్తం 12 లక్షల ముప్పై వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. అలాగే మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజలకు తాగునీటికి, పరిశ్రమలకు కూడా నీళ్లు అందుతాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



# వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో పలు నూతన అభివృద్ధి పనులు ప్రారంభం

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట్, అక్షిత ప్రతినిధి : వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఆఫీసర్స్ క్లబ్‌లో చేపట్టనున్న పలు నూతన అభివృద్ధి పనులకు శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, ఆఫీసర్స్ క్లబ్‌ను మరింత ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి సభ్యులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు



తెలిపారు. క్లబ్ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

క్లబ్ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం సభ్యులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల పట్టణంలోని పలు వార్డులలో సమీక్షా సమావేశం

## సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ పై అవగాహన

## ముఖ్య అతిథిగా హాజరైన ఇంచార్జి తుల ఉమ

రాజన్న సిరిసిల్ల, అక్షిత: భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ పైన, ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ప్రక్రియ పైన సిరిసిల్ల పట్టణంలోని 6,21, 25, 32, 36వ వార్డులలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథులుగా సిరిసిల్ల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ తుల ఉమా , బిఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళ చక్రపాణి గౌరవ అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి మ్యాన రవి కౌన్సిలర్ సభ్యులు దూడం రజిని శ్రీనివాస్, ఎలుక వెంకటేశం, బింగి రాంబాబు, కల్లూరి రేణుక రాజు, 32వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సయ్యద్ అక్రమ్



పాల్గొని బిఆర్ఎస్ పార్టీ వార్డు అధ్యక్షులకు, బూత్ కమిటీ సభ్యులకు , ముఖ్య నాయకులకు బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ, ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ప్రక్రియ గురించి వివరించి వారి సందేహాలను నివృత్తి చేస్తూ అమూల్యమైన సందేశాన్ని అందించారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గన్ పార్క్‌లో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఐఎఎస్



జగిత్యాల అక్షితబ్యూరో: జూన్ 5 తేది నాడు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణ కేంద్రం లోని గన్ పార్క్‌లో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న కలెక్టర్, మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించ వచ్చని తెలిపారు. జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజాగౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, మున్సిపల్ కౌన్సిలర్ బోయినపల్లి ప్రశాంత్ రావు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# తాడ్వాయి మండలంలో రూ.11 కోట్ల రహదారి పనులకు శ్రీకారం

## బందాల గ్రామంలో రూ.30 లక్షల అభివృద్ధి పనుల ప్రారంభం

## రూ.11 కోట్ల విలువైన బీటీ రహదారి పనులకు శంకుస్థాపన

## గిరిజన గ్రామాల అనుసంధానానికి మెరుగైన రవాణా సదుపాయాల కల్పన





ములుగు, అక్షిత న్యూస్: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బందాల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. మొదటగా బందాల గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత రహదారిని, రూ.20 లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని మంత్రి సీతక్క ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

ఈ రహదారుల నిర్మాణంతో గిరిజన గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్ఓ వికాస్ మీనా, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY

## అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

**ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**



**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ప్రధాన లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆమె తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం నాడు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులను స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.25,02,900 విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్ ఎంపీడీవో కుంచన ప్రకాష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మధుకాన్‌లో అవగాహన సదస్సు



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కొత్తగూడెం పర్యావరణ ఇంజనీర్ రవీంద్ర ఆధ్వర్యంలో స్థానిక మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని అమ్మగూడెం గ్రామంలో ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం అనే అంశంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు పర్యావరణ కాలుష్యం మానవ ఆరోగ్యంపై దాని ప్రభావం క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీసే ప్రమాదాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని ప్రజలకు సూచించారు.

అనంతరం మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ ఆవరణలో వృక్షారోపణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ ఏవీపీ వై కోటయ్య ఇతర అధికారులు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది నేలకొండపల్లి మండలం అమ్మగూడెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తుల సమయంలో అధికార యంత్రాంగం

# అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్ అక్షిత బ్యూరో:** ప్రకృతి విపత్తుల సమయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి వెంటనే స్పందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రతి జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరదలు, విపత్తులు సంభవించినప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో వర్షాకాలం ప్రారంభానికి ముందే మరమ్మత్తులు పూర్తి చేయాలని, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వరదల నుండి ప్రజలను రక్షించడానికి బోట్లు, లైఫ్ జాకెట్లు, అవసరమైన పరికరాలు సిద్ధం



చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పొందిన సిబ్బందిని సహాయక చర్యలకు అందుబాటులో ఉంచాలని, పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్, రహదారులు భవనాల శాఖల ఆధ్వర్యంలో రహదారులు, క్వర్టులు, లో లెవెల్ వంతెనల మరమ్మత్తులు చేపట్టాలని, కల్వర్టులలో పైపులలో ఉన్న చెత్తను తొలగించాలని తెలిపారు. మిషన్ భగీరథ శాఖల అధికారులు తమ పరిధిలోని ట్యాంకులు, పైప్ లైన్ల మరమ్మతులు చేయాలని, వర్షాకాలంలో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని, నాలా లలోని పూడికను తొలగించాలని, మురుగు కాలువలను శుభ్రం చేయాలని, అవసరమైన బ్లీచింగ్ పౌడర్, దోమల మందులు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువులు, కాలువల మరమ్మత్తులు, ప్రాజెక్టుల గేట్ల మరమ్మత్తులు చేయాలని, ప్రాజెక్టులోనికి వచ్చే వరదలపై సమీక్షించుకోవాలని, ప్రాజెక్టు క్రింద ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను గుర్తించి సిద్ధం చేయాలని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నెలలు నిండిన గర్భిణులను వరదలు సంభవించే ప్రాంతాల నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, డయాలసిస్, ఆస్తమా రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలను గుర్తించాలని, గ్రామాలలో, మున్సిపాలిటీలలో పాతబడిన గృహాలను గుర్తించి అందులో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలలో ఉండేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేయాలని, వరదల కారణంగా పంటలు మునిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆయా గ్రామాల జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వంగిన/విరిగిన విద్యుత్ స్తంభాలు, వదులుగా ఉన్న/వ్రేలాడే విద్యుత్ తీగలను వెంటనే మరమ్మత్తు చేయాలని తెలిపారు. పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వ్యవహరించి వరదలు, విపత్తులు సంభవించినప్పుడు జనజీవనానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల వేధింపులతోనే

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శ్రీధర్ బాబు ఆత్మహత్య

**నిష్పక్షపాత విచారణతో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

**జేఏసీ నాయకులు రాహుల్ రాజ్, వినోద్ కుమార్ డిమాండ్**



**నిర్మల్ అక్షిత బ్యూరో:** రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ గిరిజన సంక్షేమ శాఖలో ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వాద్య శ్రీధర్ బాబు విషాద మరణం పట్ల నిర్మల్ జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేసింది. శ్రీధర్ బాబు ఆత్మహత్యకు నిరసనగా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షులు రాహుల్ రాజ్, జనరల్ సెక్రెటరీ వినోద్ కుమార్ మాట్లాడుతూ, మృతుడి భార్య చేసిన ఫిర్యాదును పరిశీలిస్తే కార్యాలయ వేధింపులు, తీవ్ర మానసిక ఒత్తిళ్లే ఈ దారుణ ఘటనకు కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం ఈ ఘటనను అత్యంత సీరియస్‌గా తీసుకుని ఉన్నత స్థాయి నిష్పక్షపాత విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు.

లిబాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలిలి

శ్రీధర్ బాబు ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై లోతైన దర్యాప్తు నిర్వహించి, విధుల పేరుతో వేధింపులకు పాల్పడిన అధికారులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు.

**కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా -- ఉద్యోగం కల్పించాలి**

కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న శ్రీధర్ బాబు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. తక్షణ ఆర్థిక సహాయంగా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయడంతో పాటు కుటుంబంలోని ఒక అర్హుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కొందరు అధికారుల వేధింపులు, మానసిక ఒత్తిళ్లు, అవమానకర ప్రవర్తనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయాలని, జిల్లా స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గౌరవప్రదమైన, భద్రమైన పని వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శ్రీధర్ బాబు కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ తరఫున రాహుల్ రాజ్, వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పలువురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా
# రైతులు పంటలు సాగు చేయాలి

### పంట మార్పిడి విధానాలు అవలంబించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, అక్షిత బ్యూరో జూన్ 4:** వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటల సాగులో మార్పులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. గురువారం కుంటాల మండలం అంబగంటి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్‌తో కలిసి పాల్గొన్న ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే అవకాశం లేదని వాతావరణ శాఖ నివేదికలు సూచిస్తున్నందున రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పంట మార్పిడి పద్ధతులను అవలంబిస్తూ తక్కువ నీటి అవసరమయ్యే కొత్త రకాల పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, మార్గదర్శకత్వాన్ని వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తారని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించి అధిక లాభాలు పొందాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను వినియోగించుకుని డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను



అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అవసరానికి మించి ఎరువులు వాడరాదని సూచించిన కలెక్టర్, జిల్లాలో రికార్డు స్థాయిలో మొక్కజొన్న కొనుగోళ్లు జరిగాయని, రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్మల్ జిల్లా మూడో స్థానంలో నిలిచిందని వెల్లడించారు.

**పరిశుభ్రత, నీటి సంరక్షణపై అవగాహన**

రాబోయే వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని కలెక్టర్ సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని వివరించారు.

వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టుకోవాలని, ప్రతి ఇంటి వద్ద సోక్‌పిట్లు నిర్మించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి కొరత రాకుండా చూడాలని పిలుపునిచ్చారు.

**ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి**

శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు కందులు, మినుములు, పెసర్లు, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు మంచి లాభాలు పొందుతున్నారని, ఇతర రైతులు కూడా ఆ దిశగా ముందుకు రావాలని కోరారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఇద్దరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.

**మహిళా సంఘ భవనం, జీవనోపాధి కేంద్రాల ప్రారంభం**

అంతకుముందు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

గ్రామసభకు హాజరైన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ జ్యోతిబాయి, ఇతర అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో
# బీఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపడాలి

### టీఏసీ సమావేశంలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి





**ఖమ్మం/అక్షిత బ్యూరో :** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ తన సేవలను మరింత వేగవంతం చేయాలని ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం అంతరాయం లేని సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ఏర్పాటు చేసిన టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఆయన సమీక్షించారు.

**సేవల్లో నాణ్యత పెరగాలి..**

ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా బీఎస్ఎన్ఎల్ సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.ప్రభుత్వ రంగ సంస్థగా సామాన్యులకు భరోసానిచ్చే సేవలను అందించడం మన బాధ్యత. బ్రాడ్ బ్యాండ్ సేవలను మారుమూల గ్రామాలకు విస్తరించడంతో పాటు వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేయాలి అని సూచించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుల నుంచి పలు సూచనలను స్వీకరించాక సిగ్నల్ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన కొత్త టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.నెట్‌వర్క్ విస్తరణలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. సంస్థ బలోపేతం అందరి బాధ్యత

బీఎస్ఎన్ఎల్ పునరుజ్జీవనానికి అధికారులు మరింత అంకితభావంతో పనిచేసి కస్టమర్ల నమ్మకాన్ని గెలవాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ సంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా అత్యంత తక్కువ ధరలో నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడమే మన ముందున్న ప్రధాన లక్ష్యం కావాలని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ యాసా వెంకటేశ్వర్లు ఇమామ్ బాయ్ సత్యనారాయణ రెడ్డి రంజిత్ నాయక్ కనకరాజు మచ్చా రామారావు రామ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ కూరాకుల గోపికి డబ్ల్యూజేఐ, టీజేఏ నేతల నివాళి



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ జనంసాక్షి దిన పత్రిక ఖమ్మం జిల్లా బ్యూరో ఇంఛార్జి కూరకుల గోపీకి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) తెలంగాణ జర్నలిస్ట్స్ అసోషియేషన్ (టీజేఏ)నేతలు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలోని గోపి స్వగ్రామం పాపటపల్లి వెళ్ళిన డబ్ల్యూజేఐ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యేశ్వర రావు (ఎన్ఎస్ రావు) ఖమ్మం జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్ టీజేఏ జిల్లా అధ్యక్షులు నాగ స్వామి డబ్ల్యూజేఐ ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ కన్వీనర్ కె కళ్యాణ్ చక్రవర్తి జిల్లా నాయకులు కట్టేకోల చిన నరసయ్య మోడెపల్లి కిరణ్ గోగుల నారాయణ రావు జాబిశెట్టి కుటుంబ రావు ఏనిగండ్ల శ్రీనివాస రావు బొడ్డుపల్లి రవీందర్ గోపి మిత్రుడు పసుపులేటి ఉపేందర్ తదితరులు ఆయన చిత్ర పటానికి పూలు వేసి నివాళులర్పించారు. గోపి ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా యూనియన్ల నేతలు గోపీతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన అకాల మరణం జర్నలిస్టు సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు.

## వాతావరణ మార్పులను ఎదుర్కొందాం, మన భవిష్యత్తును కాపాడుకుందాం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రమాకాంత్



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** ప్రకృతి నుంచి ప్రేరణ పొందుదాం, వాతావరణ మార్పులను ఎదుర్కొందాం, మన భవిష్యత్తును కాపాడుకుందాం” అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రమాకాంత్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా న్యాయస్థానంలో పర్యావరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ  పర్యావరణ దినోత్సవం సందర్భంగా మాత్రమే కాకుండా ప్రతిరోజు కూడా చెట్లను నాటడం వాటిని కాపాడుకోవడం భవిష్యత్ తరాలకు మంచి ప్రకృతిని అందించడం మన అందరి బాధ్యత అని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని భవిష్యత్తులో ప్లాస్టిక్ భూతం మానవాళికి ఎంతో హాని కలిగిస్తుందని తెలియజేశారు. వాతావరణ మార్పులను అడ్డుకోవడం, గ్లోబల్ వార్మింగ్ ను తగ్గించడం ప్రకృతి సమతుల్యతను కాపాడటం కోసం అని అర్థం. మన భవిష్యత్తు కోసం మన రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన నివాసయోగ్యమైన భూమిని అందించాలని కోరారు. కావున అందరూ కూడా పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని సూచించారు.  ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.కలర్చన ,అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కవిత, జూనియర్ సివిల్ జడ్జి లు శ్రీలత, అశ్విని, కార్తీక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమార్, సెక్రటరీ వెంకట రమణ, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్, అటవీ శాఖ అధికారులు విజయ్ రాజు కుమార్, బాల కిష్టమ్మ, సిబ్బంది న్యాయమూర్తులు కోర్టు సిబ్బంది లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన బిజెపి నాయకులు



**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాయపర్తి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. మండల అధ్యక్షుడు నూనె అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు వడ్లకొండ రవి, మండల ప్రధాన కార్యదర్శి మందపురి రాజు, యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పెండ్యాల గణేష్, మండల కార్యదర్శి మందపురి రాజశేఖర్, యువ మోర్చా మండల అధ్యక్షుడు మంచాల సుమన్ యాదవ్, నాయకులు శివ నేత్ర తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని నాయకులు పిలుపునిచ్చారు. అదేవిధంగా భారత ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గొప్ప విషయం అని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ విశ్వ గురువుగా ఆదరిస్తుందని వారు అన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన నవ్య కళాశాల విద్యార్థినిలు..



**జగిత్యాల అక్షితబ్యూరో:** జూన్ 5వ తేది రోజున పర్యావరణ దినోత్సవం సందర్భంగా జగిత్యాల పట్టణం లోని నవ్య బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు జగిత్యాల అర్బన్ గ్రామము లోని అంబారిపేట్ లోని అడ్వాన్ ఫారెస్ట్ లో జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అంబర్ పేట్ ఫారెస్ట్ ను సందర్శించి విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ ఎం.రవి ప్రసాద్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఏ.పద్మారావు, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.మహేష్ లు విద్యార్థులకు పర్యావరణం పైన దాని పరిరక్షణ పైన వన్యప్రాణులపైన అవగాహన కల్పించి వారిచే మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గాలిపెల్లి ఈశ్వర్ కుమార్, కరస్పాండెంట్ శ్రీ పాద నరేష్ మరియు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

## అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** జిల్లాలో సరైన అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలంలోని కొత్తసార్సాలా గ్రామం వద్ద సార్సాలా వాగు నుండి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపి అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సరైన అనుమతులు లేకుండా వాగుల నుండి ఇసుకను తరలించడం, చెరువుల నుండి మట్టిని తరలించడం చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ నుండి మన ఇసుక వాహనం యాప్ ప్రారంభించిందని, ఇసుకను తరలించే వారు యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని అనుమతి తీసుకోవాలని, సరైన అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ట్రాక్టర్ల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, శుక్రవారం 2025-26 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికానికి సంబంధించిన డిసిసి, డిఎల్ఆర్ సి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,




బ్యాంకుల సహకారం వల్ల ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని, దీనికోసం కావలసిన సహకారం బ్యాంకులు అందించాలన్నారు. పేద ప్రజల ఉన్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకులతో ముడిపడి ఉన్న ఎన్నో రకాల పథకాలు అమలు పరుస్తున్నాయని, ఇవి క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలందరికీ అందివ్వాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తత, పొదుపు, బ్యాంకింగ్ పై అవగాహన కలిగేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, వీధి వ్యాపారస్తులకు, విద్యార్థులకు అందించు రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు.

అనంతరం 2026 - 27 వార్షిక రుణ ప్రణాళిక నివేదికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఎస్బిఐ, టిజీబి రీజినల్ మేనేజర్లు రంజన్ కుమార్, నవీన్ కుమార్, ఆర్బిఐ లింక్డ్ బ్యాంకింగ్ ఆఫీసర్ రాములు, ఇతర అధికారులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**వరంగల్, అక్షిత బ్యూరో:** భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, పేర్కొన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందితో కలిసి పండ్ల మొక్కలను నాటారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా అటవీ సంపద క్రమంగా తగ్గిపోతుండటం, పచ్చదనం స్థానంలో కాంక్రీట్ నిర్మాణాలు పెరుగుతుండటం, వాహనాలు మరియు పారిశ్రామిక ప్రాంతాల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు. దీనివల్ల వాతావరణ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, సమయానికి వర్షాలు కురవకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిణామాలు ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు.

ఈ పరిస్థితులకు ప్రధాన కారణం పచ్చదనం తగ్గిపోవడమేనని పేర్కొన్న ఆయన, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విస్తృత స్థాయిలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ద్వారా రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీపీలు, అంకిత్ కుమార్, దారా కవిత, అదనపు డీసీపీ, రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు నర్సింహారావు, నాగయ్య, అంతయ్య, సురేంద్ర, ఆర్ఐలు సతీష్, శ్రీనివాస్, చంద్రశేఖర్, శ్రీధర్తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల



**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్లలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం--2026 కార్యక్రమాన్ని గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కళాశాల అసోసియేట్ డీన్ (ఇన్చార్జ్) డా. రజియా సుల్తానా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల, సిరిసిల్లకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డా. పెద్ది రామ్మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని "పర్యావరణం, జీవనశైలి మరియు వ్యాధుల మధ్య సంబంధం" అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి మరియు సమతుల్య ఆహారపు అలవాట్లు మానవ ఆరోగ్యానికి ఎంతో అవసరమని తెలిపారు. పర్యావరణ కాలుష్యం వల్ల అనేక వ్యాధులు వ్యాపిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ప్రకృతి సంరక్షణకు బాధ్యత వహించాలని సూచించారు.కార్యక్రమంలో ా×ూాా మరియు గ్రీన్ క్లబ్ ఇన్చార్జ్ డా. పి. మధుకర్ రావు ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించి, పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మరియు గ్రీన్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.